మీ వెంటే ఉంటా.. ఆశీర్వదించండి


వృద్ధుడి ఆశీర్వాదం తీసుకుంటున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: పదేళ్లుగా కార్వాన్ ఎమ్మెల్యేగా అందరితో కలిసి ఉంటున్నానని ఈసారి కూడా తనకు ఓటు వేసి గెలిపించాలని కార్వాన్ సిట్టింగ్ ఎమ్మెల్యే, అభ్యర్థి కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన నానల్‌నగర్, టోలిచౌకీ, గోల్కొండ డివిజన్లలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలుసుకొని తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్వాన్ నియోజకవర్గంలో ప్రస్తుతం ప్రతి ఇంటికి తాగునీరు అందుతుందని తాను ప్రణాళికాబద్ధంగా నీటి సరఫరాపై ముందుకు సాగుతుండడం వల్లే ఇది సాధ్యమైందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలు బస్తీల వారు ఓటు వేస్తామంటూ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, బదరుద్దీన్, హారూన్‌ఫరాన్, షకీల్ అలీ ఖాన్ తదితరులున్నారు.

రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే


ప్రచారంలో మిత్ర కృష్ణ తదితరులు

గోల్కొండ: తెలంగాణలో మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వమే రానుందని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గం అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన కార్వాన్, గోల్కొండ డివిజన్లలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. తెలంగాణ నేడు దేశంలోనే ఆర్థికంగా బలోపేతమైన రాష్ట్రంగా తయారైందంటే అది సీఎం కేసీఆర్ సమర్థ పాలనకు అద్దం పడుతుందని ఆయన అన్నారు. నేడు దేశంలో వచ్చే విదేశీ పెట్టుబడులు నేరుగా తెలంగాణకే వస్తున్నాయని ఆయన అన్నారు. పేద, బడుగు వర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆయన అన్నారు. తూమ్‌కుంట అరుణ్‌కుమార్, అభిషేక్ మిత్ర తదితరులున్నారు.

గోషామహల్‌ను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తాం


ప్రచారం చేస్తున్న కోలేటి దామోదర్ గుప్తా తదితరులు

అబిడ్స్: పదేళ్లుగా బీజేపీ హయాంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గోషామహల్‌ను మంత్రి కేటీఆర్ దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తారని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా పేర్కొన్నారు. బీఆర్ఎస్ గెలిచిన వెంటనే మంత్రి కేటీఆర్ స్వయంగా డిసెంబర్ 3న గోషామహల్‌ను దత్తత తీసుకుంటారని ఆయన అన్నారు. శుక్రవారం అప్పర్ ధూల్‌పేట్ పరిసర ప్రాంతాల్లో మాజీ కార్పొరేటర్ పరమేశ్వర్ సింగ్ బీఆర్ఎస్ నేతలు ఆనంద్ సింగ్, బల్దీప్ సింగ్‌తో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా మాట్లాడుతూ.. పదేళ్లుగా ఎమ్మెల్యే రాజాసింగ్ ఎలాంటి అభివృద్ధి చేయకపోవడంతో గోషామహల్‌ను మంత్రి కేటీఆర్ దత్తత తీసుకుని గచ్చిబౌలి తరహాలో అభివృద్ధి చేస్తారని ఆయన అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే నందకిషోర్ వ్యాస్‌ను గెలిపించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నవనీత, బుజ్జి, మనోహర్ గైక్వాడ్, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

బీజేపీ అవినీతి పాలనకు చరమగీతం పాడాలి


ప్రచారంలో చలపతిరావు, ఆశీష్‌కుమార్ యాదవ్, ఆనంద్‌కుమార్

అబిడ్స్: బీజేపీ అవినీతి పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని రాష్ట్ర బీఆర్ఎస్ కార్మిక విభాగం ఈఎస్ఐ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. చలపతిరావు పేర్కొన్నారు.. పదేళ్లుగా బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అవినీతికి పాల్పడుతూ ప్రజల అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. జాంబాగ్ పరిసర ప్రాంతాల్లో బీఆర్ఎస్ నాయకులు ఆశీష్ కుమార్ యాదవ్, ఆనంద్ కుమార్ గౌడ్, ధనరాజ్‌తో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం చలపతిరావు మాట్లాడుతూ.. ఒక్కరోజు కూడా నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోని రాజాసింగ్‌కు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సేవచేసే బీఆర్ఎస్ అభ్యర్థి నందకిషోర్ వ్యాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు అందరు కృషి చేయాలని కోరారు. నరేందర్‌యాదవ్, ముఖేష్ ముదిరాజ్, వినోద్ యాదవ్, ప్రియా గుప్తా, అనిత పాల్గొన్నారు

కాంగ్రెస్ పార్టీకే మా మద్దతు



సుల్తాన్‌బజార్: తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు బెల్లంపూడి దుర్గారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసి మద్దతు తెలినట్లు చెప్పారు. వారు మాట్లాడుతూ.. రానున్న ప్రభుత్వాలు ఫెడరేషన్లకు పాలకమండలి ఏర్పాటు చేయాలన్నారు. ఈ ప్రభుత్వాన్ని ఓడించడానికి, మన డిమాండ్లను బలపరుస్తున్న కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలవాలని స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీకి మద్దతునిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డిని కలిసి మద్దతు తెలిపారు. భాస్కరుడు, రాకేష్, వీరప్ప, కర్ణాకర్, సాయి, అరుణ, సునీత, వేణు, వీరన్న పాల్గొన్నారు.

గెలిపిస్తే..నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

చాంద్రాయణగుట్ట: రోడ్డు రోలర్ గుర్తుకు ఓటు వేసి యుగ తులసి పార్టీని గెలిపించాలని ఆ పార్టీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం అభ్యర్థి ఆడాల కరుణ తెలిపారు. రక్షాపురం, అరుంధతి కాలనీలలో శుక్రవారం ఆమె మహిళలతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ..తెలంగాణలో గోవు గెలుపు.. దేశానికే మలుపుగా మారుతుందన్నారు. గోమాతకు ఒక్క అవకాశం ఇచ్చి నియోజకవర్గం అభివృద్ధి కోసం యుగ తులసి పార్టీని గెలిపించాలని కోరారు.


ప్రచారం చేస్తున్న ఆడాల కరుణ

రంగారావుకు కల్చరల్ ఐకాన్ బిరుదు ప్రదానం



గన్‌ఫౌండ్రీ: శృతిలయ ఆర్ట్స్ అకాడమీ, సీల్‌వెల్ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో సిరిడీ సాయి–సత్యసాయి జన్మదిన వేడుకలను శుక్రవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాసామ్రాట్ పాత్తూరి రంగారావుకు కల్చరల్ ఐకాన్ బిరుదును ప్రదానం చేశారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్‌గుప్తా, యువకళా వాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ, శ్రీశైలం దేవస్థానం బోర్డు సభ్యులు విరూపాక్ష స్వామి, కళాపత్రిక సంపాదకులు మహ్మద్ రఫీ, శృతిలయ కార్యదర్శి ఆమని పాల్గొన్నారు.

‘గెలిపిస్తే.. దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తా’


మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి వీరేందర్ బాబు యాదవ్

గౌలిపురా: ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని యాకుత్‌పురా నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి నక్కబోయిన వీరేందర్ బాబు యాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సాయంత్రం హనుమాన్‌నగర్ ఫేజ్–1, 2, 3 ప్రాంతాల్లో ఆయన నాయకులు, కార్యకర్తలో కలిసి పాదయాత్ర నిర్వహిస్తూ ఈసారి కమలం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలన్నారు. మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తనకు ఈసారి అవకాశం కల్పించి గెలిపిస్తే నియోజకవర్గంలోని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానన్నారు. జమాల్‌పూర్ చంద్రశేఖర్, గౌలీకర్ ధీరజ్ లాల్, సుమన్‌కుమార్ ముదిరాజ్, రఘుకాంత్, వెంకటేష్, భానుప్రకాశ్, అశోక్, బొట్టు వెంకటేశ్, కే. రేణుక పాల్గొన్నారు.

కార్వాన్ నుంచి అమర్‌సింగ్‌ను గెలిపించండి

మంత్రి రాజ్‌నాథ్ సింగ్


మాట్లాడుతున్న కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

జియాగూడ: కార్వాన్ అసెంబ్లీ నుంచి అమర్‌సింగ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కార్వాన్ బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన రోడ్డుషో, బహిరంగ సభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అంతకు ముందు గుడిమల్కాపూర్ నుంచి కార్వాన్, జియాగూడ పటేల్ హోటల్ మీదుగా రోడ్డు షో, బైక్‌ర్యాలీ కార్యక్రమం కొనసాగింది. పలు చోట్ల యువత ఘనస్వాగతం పలికింది. అనంతరం జియాగూడ సంజయ్‌నగర్‌లో ఏర్పాటైన బహిరంగ సభకు విచ్చేయగా రాజ్‌నాథ్‌సింగ్‌ను గజమాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..బీజేపీ ఇచ్చిన హామీలను అంచెలంచెలుగా నెరవేర్చిందని ముఖ్యంగా 371 ఆర్టికల్‌ను రద్దు చేసిందని, అయోధ్యలో భవ్య రామమందిర్ నిర్మిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చారన్నారు. అలాగే ట్రిబుల్ తలాక్‌ను రద్దుచేసి ముస్లిం మహిళలను గౌరవించామన్నారు. తెలంగాణలో పదేళ్ల నుంచి కేసీఆర్ ప్రభుత్వం హామీలు ఇచ్చింది కానీ నెరవేర్చలేదని, దీంతో అభివృద్ధి వెనుకబడిందన్నారు. అమర్‌సింగ్‌ను భారీ మెజార్టీతో గెలిపించిన వెంటనే ధన్యవాదాలు చెప్పడానికి మరోసారి వస్తానని తెలిపారు. అభ్యర్థి అమర్‌సింగ్ మాట్లాడుతూ.. పాతబస్తీ నుంచి రజాకారులను ఓడించాలని, బీజేపీకి ఓటు వేయాలని కోరారు. కార్వాన్‌లో ఎంఐఎం గెలవడానికి కేసీఆర్, కాంగ్రెస్ డమ్మి అభ్యర్థులను బరిలోకి దింపిందని, ఓట్లు చీల్చడానికే పథకం పన్నారన్నారు. గెలిచిన వెంటనే కార్వాన్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని, ముఖ్యంగా జియాగూడ డంపింగ్ యార్డ్‌ను తరలించడం, మోడ్రన్ స్లాటర్‌హౌస్‌ను చేపట్టడం, నందన వనం ప్రాజెక్టును పునఃప్రారంభించడం, మెట్రోరైల్ నిర్మాణానికి కృషి చేయడం, కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేవిధంగా పాటు పడుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పాండు యాదవ్, డేయిరీ సెల్ కన్వీనర్ శివకుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ మునేందర్, కన్వీనర్ గోవర్ధన్, అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ యాదవ్, సీనియర్ నాయకులు సతీష్ బిడ్లా, మహిళా అధ్యక్షురాలు నిత్య, అనిల్‌చారి తదితరులు పాల్గొన్నారు.

జూపార్కును సందర్శించిన ఎం.సి.పర్గేయన్

బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్కును శుక్రవారం వైల్డ్‌లైఫ్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ ఎం.సి.పర్గేయన్ సందర్శించారు. ఈ సందర్భంగా జూపార్కులోని వన్యప్రాణుల ఆరోగ్య పరిస్థితి, జూ నిర్వహణ తదితర వాటిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయనకు జూపార్కుల డైరెక్టర్ వీఎస్ఎన్వీ ప్రసాద్, క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్.హిరేమత్ స్వాగతం పలికారు. అనంతరం జూపార్కులో జరిగిన అభివృద్ధి పనులు, జంతువు మార్పిడి, ఎన్‌క్లోజర్‌ల సుసంపన్నం, జపార్కు జంతువుల ఆరోగ్య నిర్వాహణపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జూపార్కులో వైల్డ్‌లైఫ్ హాస్పిటల్, ఫీడ్ స్టోర్, వన్యప్రాణుల సంరక్షణ, సంరక్షణ కోసం జూపార్కు అధికారులు చర్యలు ఎంతో అభినందనీయమన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి


ప్రచారం చేస్తున్న సామా సుందర్‌రెడ్డి

యాకుత్‌పురా: కేసీఆర్ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని బీఆర్ఎస్ యాకుత్‌పురా శాసనసభ నియోజకవర్గం అభ్యర్థి సామా సుదర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన తన సతీమణి మాజీ కార్పొరేటర్ సామా స్వప్నారెడ్డి, నాయకులతో కలిసి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.

అభివృద్ధి చేయని రాజాసింగ్‌ను ఓడించండి


భాగ్యనగర్ కాలనీలో ప్రచారం చేస్తున్న నందుకుమార్ తదితరులు

అబిడ్స్: పదేళ్లుగా అభివృద్ధిని విస్మరించిన రాజాసింగ్‌ను చిత్తుగా ఓడించాలని జాంబాగ్ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జి.నందుకుమార్ పేర్కొన్నారు. భాగ్యనగర్ కాలనీలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం నందుకుమార్ మాట్లాడుతూ..ఎమ్మెల్యేగా రెండు సార్లు గెలిచిన రాజాసింగ్ మతం పేరుతో ప్రజల మధ్య విద్వేశాలు సృష్టించారన్నారు. ఎలాంటి అభివృద్ధి చేయని రాజాసింగ్‌కు ఓటు వేస్తే ఎంతో ప్రమాదం ఉందన్నారు. ప్రజలంతా బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్‌ను గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందన్నారు.

యువకుడి అదృశ్యం


షేక్ ఒవైసీ

గౌలిపురా: స్నేహితుని ఇంటికి వెళ్లిన ఓ యువకుడు కనిపించకుండా పోయిన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టా అమన్‌నగర్–బీ ప్రాంతానికి చెందిన షేక్ మునావర్ కుమారుడు షేక్ ఒవైసీ (18) ఈనెల 20న సాయంత్రం 4 గంటల సమయంలో స్నేహితుని ఇంటికి వెళ్తున్నాని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లాడు. అనంతరం తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఫలితం లేకుండా పోయింది. దీనిపై తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అసత్య ప్రచారాలను నమ్మకండి


ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, గోపాల్జీ

అబిడ్స్: బీఆర్ఎస్ అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని గోషామాహల్ బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. శుక్రవారం చందన వాడి పరిసర ప్రాంతాల్లో రాష్ట్ర బీజేపీ కో ఆర్డినేటర్ గోపాల్జీలతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం రాజాసింగ్ మాట్లాడుతూ.. పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను నానా విధాలుగా మోసం చేసిందన్నారు. కేవలం బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సంక్షేమ పథకాలు ప్రజలకు శ్రీరామరక్షన్ ఆయన పేర్కొన్నారు.

బీజేపీని తిరస్కరించండి


ప్రచారం చేస్తున్న జగన్‌మోహన్‌రావు, నందకిశోర్ వ్యాస్

అబిడ్స్: మతం పేరుతో ఓట్లు అడిగే బీజేపీని తిరస్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఇన్నర్వేషన్ టెక్నాలజీ చైర్మన్ పి.జగన్ మోహన్ రావు పేర్కొన్నారు. మతాల మధ్య చిచ్చుపెడుతూ పదేళ్లుగా ఎమ్మెల్యేగా గెలిచిన రాజాసింగ్‌కు ఈ ఎన్నికల్లో ఇంటికి పంపిస్తే గోషామహల్‌ను మంత్రి కేటీఆర్ స్వయంగా అభివృద్ధి చేస్తారన్నారు. శుక్రవారం గోషామహల్ పరిసర ప్రాంతాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్‌తో కలిసి ప్రచారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..తెలంగాణను అన్నిరంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిపించిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల కోసం బీఆర్ఎస్‌ను గోషామహల్‌లో గెలిపించాలన్నారు. నందకిశోర్ వ్యాస్ మాట్లాడుతూ..ఎమ్మెల్యేగా గెలిచిన రాజాసింగ్ దేశంలో తిరుగుతున్నాడే తప్పా గోషామహల్‌లో తిరుగలేదన్నారు. ఆనంద్‌కుమార్ గౌడ్, బబూద్‌సింగ్, విష్ణువ్యాస్, సుభాష్ తివారి, సునీల్ వ్యాస్ పాల్గొన్నారు.

మజ్లిస్‌తోనే పాతబస్తీ అభివృద్ధి

బహదూర్‌పురా: నియోజకవర్గం మజ్లిస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ మోబీన్ శుక్రవారం కిషన్‌బాగ్, దూద్‌బౌలి డివిజన్లలో నాయకులు, కార్యకర్తలతో పాదయాత్ర చేశారు. మజ్లిస్ పార్టీకి ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. పాతబస్తీ అభివృద్ధి మజ్లిస్ పార్టీతోనే సాధ్యమన్నారు. మాజీ ఎమ్మెల్యే పాషా ఖాద్రీ, కార్పొరేటర్లు హుస్సేనీ పాషా, ముక్తాధర్ పాల్గొన్నారు.


ఓట్లు అభ్యర్థిస్తున్న మహ్మద్ మోబీన్

ఆరు గ్యారంటీలు అందరికీ అవసరం


ప్రచారం చేస్తున్న పులిపాటి రాజేష్‌కుమార్ తదితరులు

చార్మినార్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాల అమలు జరుగుతుందని.. దీంతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని బహదూర్‌పురా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులిపాటి రాజేష్ కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచిపెట్టి ఈ ఎన్నికల్లో తననే గెలిపించాలని కోరారు.

విద్యార్థుల శాంతి ర్యాలీ



అబిడ్స్: లిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు శాంతిర్యాలీ నిర్వహించారు. శుక్రవారం నాడు యూనిట్–1టి ఆర్‌టీవై బీటీవై హైదరాబాద్ గ్రూఫ్ నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) ఆధ్వర్యంలో ఈ శాంతి ర్యాలీ చేపట్టారు. ఇందులో భాగంగా భాగ్యనగరంలోని ప్రజలంతా కులమత బేధాలు లేకుండా, ఐకమత్యంతో, శాంతి సమాధానాలతో మత సామరస్యాన్ని నెలకొల్పే దిశగా కృషి చేయాలని, మత విద్వేషాలను రెచ్చగొట్టే వారి మాటలు వినకుండా శాంతి స్థాపనకు తోడ్పడాలని సందేశాన్ని ఇచ్చారు.

కేశవస్వామినగర్‌లో బీఆర్ఎస్ ప్రచారం


బొట్టుపెట్టే కార్యక్రమం చేపట్టి మిత్ర కృష్ణ

జియాగూడ: కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణ గెలుపు కోసం జియాగూడ కేశవస్వామినగర్‌లో ప్రతి ఇంటింటికి బొట్టుపెట్టే కార్యక్రమం డివిజన్ ఇన్‌చార్జి మంతటి నర్సింహ, నాయకురాలు అమృతల ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో విజయానికి ప్రచారం చేస్తున్నామన్నారు.

అమిత్‌షాకు ఘన స్వాగతం



అఫ్జల్‌గంజ్: నగరానికి వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. గోల్కొండ జిల్లా కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి ముక్క కృష్ణాగుప్తా ఆధ్వర్యంలో అమిత్ షాకు స్వాగతం తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ సాంస్కృతిక వేదిక సంచలన స్కూల్ ఆఫ్ డ్యాన్స్ 40వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం కళావేదికపై ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థకు చెందిన 150 మంది కళాకారులు పలు అంశాలపై చేసిన నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, పసుమర్థి రామలింగశాస్త్రి, స్కూల్ వ్యవస్థాపక సభ్యులు పద్మా కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర పాలన కాంగ్రెస్‌కే సాధ్యం


ప్రచారంలో ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హాజిరి

గోల్కొండ: సుస్థిర పాలన అందించడం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హాజిరి అన్నారు. శుక్రవారం ఆయన కార్వాన్, టోలిచౌకీ డివిజన్లలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అంటే ప్రజల్లో నేడు భరోసా పెరిగిందని ఆయన అన్నారు. బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలు కలిసి ప్రజలను దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. మరోవైపు బీజేపీ అంటే బుల్డోజర్ అని ప్రజలు భయపడుతున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అమ్జత్‌ఖాన్, వేణుగౌడ్, అబ్దుల్లా తదితరులున్నారు.

సేవ చేసేందుకు అవకాశం ఇవ్వండి


మోదీ కటౌట్‌తో ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి మహేందర్

చాంద్రాయణగుట్ట: సేవ చేసేందుకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని బీజేపీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం అభ్యర్థి కౌడీ మహేందర్ అన్నారు. ఓంనగర్, గణేష్ నగర్, రామస్వామి గంజ్ బస్తీల్లో శుక్రవారం ఆయన నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి మొగలి జాన్యతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. తొమ్మిదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవినీతికి పాల్పడి ప్రాజెక్ట్ మనుగడే ప్రశ్నార్థకంగా మార్చారన్నారు. గ్యార ప్రభాకర్, మాదరి చంద్రశేఖర్, పండరీనాథ్, వేణు, పొన్న శ్రీనివాస్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించండి



చార్మినార్: మజ్లిస్ పార్టీ హయాంలో పాతబస్తీ పూర్తిగా అభివృద్ధికి నోచుకోవడం లేదని.. ఈసారి జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడుతానని చార్మినార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ ముజీబుల్లా షరీఫ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన తన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేసి ఈ ఎన్నికల్లో తనకే ఓటు వేసి గెలిపించాలని కోరారు.

అనారోగ్యంతో పురుషోత్తం గుప్తా మృతి



సుల్తాన్‌బజార్: తెలంగాణ తొలి, మలి ఉద్యమ నాయకుడు, గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు సంతోష్ గుప్తా తండ్రి పి.పురుషోత్తం గుప్తా(82) తుదిశ్వాస విడిచారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన శుక్రవారం ఉదయం తెల్లవారుజామున కన్నుమూశారు. 1969 తెలంగాణ ఉద్యమంలో 32 రోజుల పాటు జైలుకు వెళ్లిన పురుషోత్తం గుప్తా 2001 నుంచి సీఎం కేసీఆర్‌తో కలిసి తెలంగాణ మలి ఉద్యమంలో పెద్ద ఎత్తున పోరాటం చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్‌యాదవ్, డి.మోహన్, రామ్‌చంద్‌ర్‌రాజు, వీరేష్, రవి, సంతోష్ కుమార్, అమర్నాథ్, మల్లేష్, శివకుమార్, శ్రీధర్ మురహరి పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి


సమావేశంలో చార్మినార్ బీజేపీ అభ్యర్థి మెఘారాణి

చార్మినార్: మహిళా అభ్యర్థినైన నాకు మహిళలంతా ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని చార్మినార్ బీజేపీ అభ్యర్థి మెఘారాణి అగర్వాల్ మహిళా ఓటర్లను కోరారు. నూర్‌ఖాన్ బజార్‌లో బీజేపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చార్మినార్ నుంచి మొదటిసారి ఓ మహిళా అభ్యర్థికి బీజేపీ టికెట్ కేటాయించినందున ఈ ఎన్నికల్లో తన విజయం కోసం ప్రతి మహిళా కృషి చేయాలన్నారు.

మార్పుతోనే అభివృద్ధి సాధ్యం


ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బోయ నగేష్

చాంద్రాయణగుట్ట: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అధికారాన్ని మార్చాల్సిన అవసరం ఉందని చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బోయ నగేష్ అన్నారు. జంగమ్మెట్ మార్కెట్, రవీంద్రనాయక్ నగర్‌లలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. హస్తం పేదల నేస్తం అన్నారు. నియోజకవర్గంలో ఏళ్ల తరబడిగా అధికారం చెలాయిస్తున్న మజ్లిస్ పార్టీ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ప్రచారంలో ఎక్కడికెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతుండడం సంతోషంగా ఉందన్నారు.

పాతబస్తీలో బీజేపీకి పెరిగిన ఆదరణ


ప్రచారంలో బీజేపీ అభ్యర్థి నరేష్, మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

చార్మినార్: పాతబస్తీలో ఈసారి బీజేపీకి స్థానిక ఓటర్ల నుంచి చక్కటి ఆదరణ లభిస్తోందని బహదూర్‌పురా బీజేపీ అభ్యర్థి వై.నరేష్ అన్నారు. బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీతో కలిసి ఆయన నియోజకవర్గంలోని పలు బస్తీల్లో పాదయాత్ర నిర్వహించి ప్రచారం చేపట్టారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచిపెడుతూ ఈ ఎన్నికల్లో తనకే ఓటు వేసి గెలిపించాలని కోరారు.

యాకుత్‌పురాలో అసదుద్దీన్ ఒవైసీ ప్రచారం



యాకుత్‌పురా: మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ యాకుత్‌పురా ఎమ్మెల్యే అభ్యర్థి జాఫర్ హుస్సేన్ మేరాజ్‌కు మద్దతుగా శుక్రవారం పలు ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించి ప్రచారం నిర్వహించారు. యాకుత్‌పురా, రెయిన్‌బజార్ చమన్, మాదన్నపేట్, అల్ జాబ్రీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేశారు. మజ్లిస్ పార్టీకి ఓటు వేసి మేరాజ్ హుస్సేన్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. మజ్లిస్ పార్టీ ఇన్‌చార్జి యాసర్ అరఫత్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.